కథకానిది - కథలాంటిది

జీడిగుంట రామచంద్రమూర్తి

టాంక్‌బండ్‌మీద నడుస్తున్న చాలా మంది, అక్కడ ఆగి వింతగా చూస్తున్నారు...నీళ్ళల్లో తేలుతోంది శవం... అతనికి ఎంతో వయస్సు ఉన్నట్లు కనిపించటంలేదు. మహా ఉంటే పందొమ్మిదో, ఇరవయ్యో ఉంటాయి...

"ఏం కష్టమొచ్చిందో పాపం!... ఆత్మహత్య చేసుకున్నాడు!"– ఎవరో అన్నారు గుంపులోంచి.

"అసలు ఆత్మహత్యో, హత్యో మన కెలా తెలుస్తుంది?"— మరో పెద్ద మనిషి అనుమానంగా అన్నాడు.

"బాగా చెప్పారు!... అయినా ఈ సినిమాలు చూసి కుర్రాళ్ళు చెడిపో

తున్నారండీ! ... రాత్రి సినిమాలు చూడటం, పగలు స్కూల్లో అమ్మాయిలను ప్రేమించటం!... ఒక హీరో యినూ–ఇద్దరో ముగ్గురో హీరోలు!... దాంతో ఆ హీరోలమధ్య తగూలు!... అలాంటి తగూల్లో ఇరుక్కుంటే ఏముంటుంది ?... ఒకర్నొకరు తన్నుకోవటం ... చంపుకోవటం! ఉడుకు రక్తం కదండీ!... 'లవ్ ఎఫయిర్'లో ఏదో గొడవ వచ్చివుంటుంది!... ఎవరో ఇతగాడ్ని చంపేసి - ఇందులో పారేసి వుంటారు' – చిదంబర రహస్యాన్ని కనిపెట్టిన పోజుపెట్టి – జారిపోతున్న కళ్ళజోడును పైకి తోసుకుంటూ అన్నాడు, నడివయసులోవున్న ఇంకో పెద్దమనిషి...

"మీరన్నదీ పాయింటే! లేకపోతే ఇంత చిన్నవయసులో, హాయిగా ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన సమయంలో-ఆత్మహత్య చేసుకోవాల్సినంత అవసరం ఏమొస్తుందీ?"— ధృవపరిచాడు మొదటి వ్యక్తి.

సాయంత్రం నాలుగయ్యేవరకూ– ఆ శవాన్ని అలా ఎంతోమంది చూస్తూనే వున్నారు ... ఎవరికి తోచింది వాళ్ళు అనుకుంటూనే వున్నారు... ఆ తర్వాత పోలీసులు వచ్చారు...శవాన్ని బయటకు తీయించారు...

అందరూ అనుకున్నట్టే–ఆ కుర్రాడికి అట్టే వయస్సులేదు...తెల్లటి ప్యాంటు మీద నీలంరంగు షర్టు తొడుక్కున్నాడు ... మెడలో వెండితో చేసిన ఆంజనేయస్వామి బిళ్ళ వేలాడుతోంది.. ప్యాంటు జేబులు రెండూ ఖాళీగా వున్నాయి...చొక్కా-జేబులో మాత్రం ఓ కవరుంది...నీళ్ళల్లో తడిసిపోవటం వల్ల కవరూ, అందులోని కాగితమూ, చీకిపోయి వున్నాయి ... కాగితంమీద అక్షరం ఒక్కటీ స్పష్టంగా కనిపించటం లేదు...

ఆ రాత్రే శవాన్ని పోస్ట్‌మార్టంకి పంపించారు ... అప్పటికి అతను మరణించి సుమారు పద్దెనిమిదిగంటలు కావస్తోందనీ– హత్యచేయబడినట్లుగానీ, విషప్రయోగం జరిగినట్లుగానీ సూచనలు లేవుకనుక, అతను ఆత్మహత్య చేసుకున్నాడనీ– డాక్టర్లు రిపోర్టులో రాశారు...అంతకుముందు కనీసం రెండు రోజులైనా అతను ఆహారం తీసుకొని ఉండకపోవచ్చుననికూడా డాక్టర్లు అభిప్రాయపడ్డారు...

* * *

శంకరం మనసు ఆత్రంగా వుంది...

మరో అర్ధగంటకో, గంటకో న్యూస్ పేపరు వస్తుంది ... అందులో తమ పరీక్షాఫలితాలు పడతాయి...తాను ఈసారి పాసవుతాడు ... పాసయిం తర్వాత ఏంచేయాలీ? ... తనకయితే బి.ఏ. చదవాలని కొండంత కోరికగా వుంది...కానీ తన తండ్రి చదివిస్తాడో

లేదో?... ఆ మధ్యెప్పుడో అన్నాడు కూడా-'నాకొచ్చే సంపాదనతో నీకు బి.ఏ. కూడా చెప్పించగలనా?'—అని!

పైగా ఇప్పటికే రెండేళ్లు వృథా అయి పోయిందని పదే పదే విసుక్కుంటు న్నాడు తన తండ్రి...నిజమే మరి! మొదటిసారి కాలేజీలో చదివి పరీక్షలు రాస్తే — రెండు సబ్జెక్టుల్లో ఫెయి లయ్యాడు...మళ్ళీ అంతా చదివితేనే మంచిదని ఎవరో సలహా ఇస్తే—పరీక్ష ఫీజు కట్టి — తనకు ప్రైవేటుకూడా పెట్టించి—ఎంతో డబ్బు ఖర్చుచేశాడు... కానీ, రెండోసారికూడా తాను ఫెయి లయ్యాడు...తండ్రి చిరాకుపడ్డాడు... తాను నిరాశపడ్డాడు!

ఈసారి...మళ్ళీ ఇది మూడో ప్రయత్నం ... ఈసారి పాసవటం ఖాయం...పాసయితే, ఎలాగో కష్టపడి బి ఏ. చదివి ఏదైనా మంచి ఉద్యో గంలో చేరాలి...తన తండ్రికి సాయ పడాలి...

తన తండ్రి...ముసలయ్య, ఆ ఊరి కాఫీహొటల్లో సర్వరుగా పని చేస్తున్నాడు. రెండుపూటలా టిఫినూ, ఓ పూట భోజనం పెట్టి—నెలకు మరో ఎనభై రూపాయల జీతం ఇస్తారు— ఆ హోటలువాళ్లు!... అది కాకుండా, తన తల్లి సుబ్బులు, మిషన్‌కుట్టి అంతో ఇంతో సంపాదిస్తుంది... ఆ రాబడులే తమ కుటుంబానికి ఆధారం!... తనకు నాలుగేళ్ళ చెల్లెలుంది...దానికీ చదువు చెప్పించి పెళ్ళిచేయాలి...

ఎన్నో సమస్యలూ, ఎంతో భవి ష్యత్తూ — మరికాసేపట్లో వచ్చే తన పరీక్షా ఫలితాలమీద ఆధారపడ్డాయి...

వీధిలో దూరంగా పిల్లల గొడవ వినిపించడంతో, తన ఆలోచనలకు స్వస్తిచెప్పి—గుమ్మంలోకి వచ్చిచూశాడు శంకరం...

ఎదురింటి కనకయ్య మేస్టారింటి దగ్గర ఓ కుర్రాడు పేపరు చూస్తు న్నాడు ... చాలామంది పిల్లలు, ఆ కుర్రాడి చుట్టూ గుమిగూడి—తన నంబరు చూడమంటే తన నంబరు చూడమంటూ అల్లరిచేస్తున్నారు...

ఆరాటమో, ఉత్సాహమో తెలియ కుండా మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే, అప్రయత్నంగానే అక్క డకు నడిచాడు శంకరం... పేపర్లో తన నంబరుకోసం వెతుకుతూంటే, చేతులు సన్నగా వణుకుతున్నట్లనిపించింది...

తాను పాసవుతాడు ... అనుమానం లేదు! అయినా, తాను ఎంత కష్టపడి చదివాడనీ?...అన్నం, నిద్రా మానేసి మరీ చదివాడు... ఆ ఆలోచన వచ్చి స్థిమితపడిన శంకరం, తన నంబరు కోసం పేపర్లో చూశాడు... సెకండ్ క్లాసులో కనిపించలేదు...ఫస్ట్‌క్లాసులో చూసుకున్నాడు...అక్కడా లేదు! మరే మయినట్టూ? ప్రెస్సువాళ్లు ప్రింటు



చేయటం మరచిపోయారా?... లేకపోతే, ఒకవేళ తాను......?

'ఛీ...ఛీ... అలాంటి ఆలోచన వస్తోందేమిటీ?...ఏమైనా ఈసారి తాను పాసయితీరాలి ... మళ్ళీ మరోసారి నంబర్లన్నీ చూశాడు... రెండు సబ్జెక్టు ల్లోనే తన నంబరు కనిపించింది... అంటే...?...అంటే, మళ్ళీ ఓ'పార్ట్' పోయిందన్నమాట...ఛీ...దరిద్రం... ఇలా జరుగుతోందేమిటీ?...

శంకరం కళ్ళల్లోకి కన్నీళ్ల కట్టలు త్రెంచుకుని వచ్చాయి...

వచ్చే దుఃఖాన్ని గొంతులోనే దాచు కుని-అడుగులో అడుగు వేసుకుంటూ మళ్ళీ ఇంట్లోకి వచ్చాడు శంకరం... అప్పటికే తన తండ్రి డ్యూటీకి వెళ్ళి పోయాడు... శంకరం నెమ్మదిగా వంటింట్లోకి నడిచాడు...కొడుకు వాల కాన్ని గమనించిన సుబ్బులు ఆందోళ నగా అడిగింది.

"ఏమయిందిరా అలావున్నావ్?"- అని.

"పరీక్ష మళ్ళీ పోయింది"-అంత వరకూ గొంతులోనే ఆగిపోయిన దుఃఖం పెల్లుబికివచ్చింది శంకరానికి.

సుబ్బులు మ్రాన్పడిపోయింది... కొడుకు ఈసారైనా పరీక్ష పాసవు తాడనీ, తండ్రిలా ఏ కాఫీహోటల్లోనో సర్వరులాకాకుండా - మంచి ఉద్యోగం సంపాదించుకుంటాడనీ – క్షణం క్రితం వరకూ కొండంత ఆశపెట్టుకుంది...ఆ ఆశకాస్తా-శంకరం చెప్పినవార్త విన గానే-హరించుకపోయింది...తనకొడుకు రాత్రింబగళ్ళు ఎంత కష్టపడి చదివిందీ తనకూతెలుసు...అయినా దురదృష్టం

తమను వెంటాడుతోంది ... ఎవరు మాత్రం ఏంచేయగలుగుతారు?

ఆ రాత్రి ముసలయ్య ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది...

"ఇవాళ 'రిజల్ట్సు' వచ్చాయటగా"- రాగానే అడిగాడు భార్యని. పక్కగదిలో నిద్రపట్టక, చాపమీద అటూ ఇటూ దొర్లుతున్న శంకరానికి ఆ మాటలు వినిపిస్తున్నాయి...

"పరీక్ష ఈసారికూడా పోయింది"- తల్లి జవాబు చెప్తోంది...

ఆ తర్వాత కొన్ని నిముషాలు ఎవరి మాటలూ వినిపించలేదు...అంటే తన తండ్రికి బాగా కోపం వచ్చి వుంటుంది... అలా కోపం వచ్చినప్పుడు ఏమీ మాట్లాడకపోవటం తన తండ్రికి అలవాటు...

"అన్నం వడ్డించాలా ?" తల్లి అడుగుతోంది.

"అక్కర్లేదులే! రాగానే విన్నానుగా శుభవార్త!...కడుపు నిండిపోయింది"-

"దురదృష్టం వాడ్ని అలా వెంటాడుతూంటే వాడుమాత్రం ఏమిచేయగలడు చెప్పండి? అక్కడికీ రాత్రింబగళ్లు శ్రద్ధగానే చదివాడు పిచ్చితండ్రి"- మాతృప్రేమ ఆమె ప్రతి మాటలోనూ ప్రతిధ్వనిస్తోంది...

"ఏంచదివి ఏంలాభం? పైగా బి.ఏ. చదువుతానని పేచీకూడానూ! ఉట్టి కెగర లేనమ్మ స్వర్గానికి ఎగిరిందట... అయినా కాఫీహోటల్లో సర్వరుపని చేసే యోగం వీడి ముఖాన రాసిపెట్టి ఉంటే ఇదెలా పాసవుతాడూ?"

తండ్రి మాటలు విన్న శంకరం దిగులుతో కృంగిపోయాడు. మనసంతా ఏదో వెలితిగా అయిపోయింది.

అసలిలా ఎందుకు జరిగింది?...తన భవిష్యత్తుపై తాను ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. అవన్నీ ప్రతిమనిషీ-సాదారణంగా పెట్టుకునే అతి సామాన్యమైన ఆశలే తప్ప-అత్యాశలు కానేకావు...

ఒకసారా, రెండుసార్లా?...మూడుసార్లు తన తండ్రికి కోపం వచ్చిందంటే రాదూ? ఇప్పటికే తన చదువుగురించి ఎంతో డబ్బు ఖర్చుచేశాడు... ఇప్పుడు మళ్ళీ ఫీజులుకట్టి తనను చదివించగలడా?

ఇంత కష్టపడి చదివితేనే తాను పాస్ కాలేకపోయాడు ... ఇంక చదువుమీద తనకు శ్రద్ధ ఎలాకలుగుతుంది?

అయినా తాను ఇంతదూరం ఆలోచిస్తున్నాడన్న మాటేగానీ, ఒకవేళ రేపో మాపో, 'సెకండ్ లిస్టంటూ' మరొకటి పేపర్లో రాకూడదా? అందులో తన నంబరు ఉండకూడదా?...ఉన్నా ఉండవచ్చు...మరీ రెండుమూడు మార్కుల్లోనే తన పరీక్ష పోయుంటుంది... వాటిని కలపమని ప్రభుత్వం ఆర్డర్లిస్తే అప్పుడు తాను పాసవుతాడు...తనలాంటివాళ్ళు చాలామంది పాసవుతారు... సెకండ్‌లిస్టు తప్పకుండా వస్తుంది...

చీకటిలో కాంతిపుంజంలా చిన్నమెత్తు ఆశ కనిపించటంతో-శంకరం మనసు కొంచెం తేలికపడింది...

ఆ మర్నాటినుంచీ వరుసగా నాలుగయిదు రోజులు లైబ్రరీకి వెళ్ళి పేపర్లన్నీ చదవటం మొదలుపెట్టాడు... రెండోలిస్టు రాకపోగా – మోడరేషన్ పద్ధతిన మార్కులు కలిపే ప్రసక్తే లేదని ప్రకటనమాత్రం ఆరోరోజున పేపర్లో వచ్చింది...హతాశుడైపోయాడు శంకరం ... తన భవిష్యత్తేమిటో తనకు తెలిసిపోయింది...ఇంక తనకు చదువుకునే యోగంలేదు...

ఏదైనా ఉద్యోగంలో చేరాలి... తప్పదు!...

కానీ ఎవరిస్తారు ఉద్యోగం?... తనకు అర్హత లేం వున్నాయ్?...తాను ఖాళీగా కూర్చుంటే తనతండ్రి చూస్తూ వూరుకోడు...ఎలాగా కాఫీ హోటల్లో ఏ సర్వరు పనిలోనో పెట్టినా పెట్టగలడు.. కాఫీహోటల్లో అలా సర్వరుపని చేయటం కంటే – కాయకష్టంచేసుకుని బ్రతికినా బ్రతకచ్చు...

హైదరాబాద్‌లో ఎన్నో పరిశ్రమలున్నాయనీ-అక్కడ ఏదైనా చిన్న ఉద్యోగం ఎలాగైనా సంపాదించుకో వచ్చుననీ-అమధ్యే ఎప్పుడో ఎవరో అంటూంటే తాను విన్నాడు...

తానుకూడా హైదరాబాద్ వెడితే-ఎక్కడో అక్కడ తనకు ఓ పని దొరక్కపోదు...

ఆ నిర్ణయానికి వచ్చిన శంకరం మర్నాడే-ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయల్దేరి హైదరాబాద్ చేరుకున్నాడు.

"ఎక్కడకని పోతాడులే!...వాడే వస్తాడు!"-అని ధీమాగావున్న ముసలయ్య-మూడోనాటికికూడా శంకరం తిరిగి రాకపోయేసరికి కొంచెం ఖంగారు పడ్డాడు... తెలిసినవారికందరికీ కబురు చేశాడు... బంధువులకందరికీ ఉత్తరాలు రాశాడు-'శంకరం అక్కడకు వచ్చాడా?'-అంటూ...

పదిరోజులు గడిచాయి... పదిహేను రోజులు గడిచాయి...అయినా శంకరం జాడ తెలియలేదు...చేతి కందివస్తాడనుకున్న ఒక్కగానొక్క కొడుకూ చేయి దాటిపోయినందుకు - దిగులుపడ్డాడు ముసలయ్య...

'అన్నయ్య ఎప్పుడు వస్తాడే?' అని పదే పదే ప్రశ్నించే నాలుగేళ్ళ పసిదానికి ఏ జవాబూ చెప్పలేక గుడ్ల నీరు పెట్టుకునేది సుబ్బులు...

హఠాత్తుగా ఓరోజున - పేపర్లో ఆ వార్త చదివాడు ముసలయ్య..."ఇంటర్ పరీక్షలో ఫెయిలయిన విద్యార్థులకు అయిదుమార్కులు కలుపుతున్నారనీ-అలా మార్కులు కలిపిన తరువాత పాసయ్యే విద్యార్థుల జాబితా త్వరలో వస్తుందనీ"- ఆ వార్త సారాంశం...

ముసలయ్యలో మళ్ళీ కొత్త ఆశలు కొండంత ఎత్తున పెరిగాయి...'రెండో లిస్టులోనయినా శంకరం పాసవుతాడు... ఈపాటికి శంకరం ఎక్కడ ఉన్నా ఆ వార్త చూసే ఉంటాడు-తిరిగి ఇంటికి వచ్చేస్తాడు - అనుకొన్నాడు ... కొడుకు అలా తిరిగిరావాలని కొండమీది దేవుడికి కోటి దణ్ణాలు పెట్టుకుంది సుబ్బులు...

రెండోలిస్టు పేపర్లో వచ్చింది... శంకరం పాసయ్యాడు ... ముసలయ్య సంతోషానికి అవధులు లేవు...

'శంకరం ఈపాటికి తన నంబరు పేపర్లో చూసుకునే వుంటాడు...రేపో మాపో తప్పకుండా తిరిగివస్తాడు'- ఆ ఆశతోనే, నిద్రాహారాలుమానేసి, శంకరంకోసం ఎదురుచూశాడు ముసలయ్య ... రాత్రింబగళ్ళు వీధితలుపు ఎక్కడ చప్పుడైనా శంకరమే వచ్చి వుంటాడని-కళ్ళల్లో వత్తులువేసుకుని మరీ చూసింది సుబ్బులు...

ఒకరోజు...రెండురోజులు...మూడు రోజులు...

రోజులు గడిచిపోతూనేవున్నాయ్... కానీ శంకరం జాడలేదు...ఎవరో సలహా



ఇస్తే—పేపర్లో ప్రకటన వేయించాడు ముసలయ్య...

"కనిపించుటలేదు."

ఈ ఫొటోలోవున్న శంకరం అనే పంథొమిదేళ్ళ పిల్లవాడు గత ఇరవై రోజులుగా కనిపించటంలేదు...చామన చాయ రంగు...గిరజాల జుట్టు... ఇంట్లోంచి వెళ్ళేరోజున తెల్లపాంటూ నీలంరంగు షర్టూ తొడుక్కున్నాడు... మెడలో వెండితోచేసిన ఆంజనేయ స్వామి బిళ్ళవుంది...ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమతి ఇవ్వబడు తుంది...

"...బాబూ...శంకరం! నీ పరీక్షా ఫలితాల రెండోలిస్టు వచ్చింది. నువ్వు పాసయ్యావ్...ఎలాగైనా కష్టపడి నీకు బి.ఏ. చెప్పిస్తాను. కోపంమానేసి ఎక్క డున్నా వెంటనే వచ్చేయ్...నీకోసం అమ్మా, చెల్లాయీ బెంగపెట్టు కున్నారు...

...నీ తండ్రి
ముసలయ్య..."

ప్రకటన ఇచ్చిన ముసలయ్య, కొడుకుకోసం, ఆతృతతో ఎదురుచూస్తూ వున్నాడు...కానీ ప్రకటన చూసుకుని తిరిగి వచ్చేందుకు శంకరం లేడు!

హైదరాబాదు నగరంలో వారం రోజులపాటు ఉద్యోగంకోసం కాళ్ళరి గేలా తిరిగి, ఇక తనకు ఉద్యోగం రాదని తెలుసుకున్నాక ఆకలిని జయించ టానికి మార్గం కనిపించక-ఆత్మహత్య చేసుకున్నాడు...

ఉద్యోగం రాదని తెలిసినా, రెండో లిస్టు వస్తుందని ముందుగానే తెలిసుంటే శంకరం ఆత్మహత్య చేసుకునేవాడు కాదేమో?...